సాక్షి
కర్నూలు
గురువారం । 2 । నవంబర్ । 2023



ప్రహ్లాదవరదా.. పాహిమాం!

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో పవిత్రోత్సవాలు బుధవారం రాత్రి పూర్ణాహుతితో ముగిశాయి. ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. గ్రామోత్సవం కనుల పండువగా సాగింది.



పారదర్శకతకు పెద్దపీట

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు నుంచి మధ్యాహ్నం భోజనం వరకు అన్ని వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో పారదర్శకత పెరుగుతోంది. 10లో▸

ఉత్తమ సేవలకు పతకాలు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు, అగ్నిమాపక శాఖలలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. 10లో▸

కౌలు పత్రం...సాగుదారుకు ఊతం

- కౌలుదారుల అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటు
- పట్టాదారుల తరహాలో వివిధ రూపాల్లో సాయం
- 2023–24లో రికార్డు స్థాయిలో 18,481 కౌలు కార్డులు జారీ
- గత ఏడాది 3,044 మంది సాగుదారులకు రూ.4.10 కోట్లు
- ఈ ఏడాది 6,965 మంది సాగుదారులకు రూ.5.22 కోట్లు పెట్టుబడి సాయం
- వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద మరికొంత మందికి పెట్టుబడి సాయం అందే అవకాశం
- సీసీఆర్‌సీ కార్డులతో ఉపశమనం పొందుతున్న సాగుదారులు
- టీడీపీ హయాంలో రుణ అర్హత కార్డుల జారీతో ప్రయోజనం సున్నా

రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే వారికి వివిధ రూపాల్లో సాయమందిస్తున్న సర్కారు కౌలుదారులకు సైతం అండగా నిలుస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా పంట సాగుదారు హక్కు పత్రం (సీసీఆర్‌సీ) అందించి అనేక ప్రయోజనాలు కల్పిస్తోంది. రైతుల తరహాలోనే కౌలుదారులకు వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయంతో పాటు బ్యాంకుల్లో రుణ సౌకర్యం కల్పిస్తూ వారి అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తోంది.



సాగుదారులకు ఎరువులు అందజేస్తున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల్లో కౌలుదారులు ప్రత్యేకం. కొందరు చిన్న,సన్నకారు రైతులు తమకు ఉన్న భూమి సరిపోక ఇతరుల భూములను కౌలుకు తీసుకుంటారు. ఎలాంటి స్వంత భూమి లేని మరికొందరు వ్యవసాయంపై ఆసక్తితో ఇతర రైతుల నుంచి భూములను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తుంటారు. ఇటువంటి వారికి సైతం ప్రభుత్వం తోడుగా నిలబడుతోంది. పంట సాగుదారు హక్కు పత్రం (సీసీఆర్‌సీ) ద్వారా సాయం అందజేస్తుంది. జిల్లాలో ఎక్కువ మంది కౌలుదారులకు ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో స్పెషల్ డ్రైవ్ పెట్టి సీసీఆర్‌సీ కార్డుల జారీ చేస్తుంది. టీడీపీ హయాంలో సాగుదారులకు రుణ అర్హత కార్డులు జారీ చేశారు తప్ప ఇసుమంత ప్రయోజనం జరిగిన దాఖలాలు లేవు.

జిల్లాలో రికార్డు స్థాయిలో సీసీఆర్‌సీ కార్డుల జారీ

2022–23లో 6960 సీసీఆర్‌సీ కార్డులు మాత్రమే జారీ చేశారు. 2023–24లో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని రికార్డు స్థాయిలో జారీ చేసింది. జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉండగా... 3,63,442 మంది రైతులు ఉన్నారు. వీరిలో 20,028 మంది కౌలుదారులను గుర్తించారు. ఇందులో ఈ ఏడాది ఇప్పటి వరకు 18,481 మందికి సీసీఆర్‌సీ కార్డులు జారీ కావడం విశేషం. ఇంకా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం అత్యధికంగా ఆదోని మండలంలో 2,058 మంది సాగుదారులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు. కల్లూరు మండలంలో 1490, కర్నూలు రూరల్ మండంలో 1380, ఓర్వకల్లు మండలంలో 1334, కౌతాళం మండలంలో 1,166, కోడుమూరు మండలంలో 1,022 ప్రకారం సీసీఆర్‌సీ కార్డులు జారీ అయ్యాయి.

కౌలుదారులకు రూ.122.95 కోట్ల రుణాలు

సాగుదారులకు ఈ ఏడాది పెద్ద ఎత్తున రుణాలు పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ ఏడాది 18,481 మంది సాగుదారులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయగా.. వీరికి బ్యాంకుల ద్వారా రూ.122.95 కోట్ల రుణాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ఒక్క కర్నూలు మండలంలోనే సాగుదారులకు రూ.2 కోట్లకు పైగా రుణాలు పంపిణీ చేశారు. సాగు దారులకు జీఎల్‌జీ గ్రూపులుగా ఏర్పడితే రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయి. 2023–24లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సాగుదారులకు పెద్దపీట వేస్తోంది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా వారికి రూ.15 కోట్లు పంట రుణాలు పంపిణీ చేయాలని కేడీసీసీబీ పాలకవర్గం నిర్ణయించింది. ఇప్పటికే పీఏసీఎస్‌లకు రూ.15 లక్షల ప్రకారం బడ్జెట్ కూడా విడుదల చేయడం విశేషం.

6,965 మంది కౌలుదారులకు వైఎస్‌ఆర్ రైతుభరోసా

11 నెలల కాలపరిమితితో సీసీఆర్‌సీ కార్డులు జారీ చేస్తారు. ఇవి పొందిన సాగుదారులు అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలు పొందవచ్చు. ప్రధానంగా సీసీఆర్‌సీ కార్డులు పొందిన సాగుదారులకు పెట్టుబడి సాయంగా వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద రూ.13,500 పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది.



కౌలుపత్రం

పట్టాదారుల తరహాలో అన్ని ప్రయోజనాల వర్తింపు

పట్టాదారుల తరహాలో కౌలుదారులకు సైతం ప్రభుత్వం అన్ని ప్రయోజనాలు వర్తింపజేస్తుంది. సీసీఆర్‌సీ కార్డు ఉంటే చాలు. ఈ–క్రాప్‌లో అధికారులు పంట నమోదు చేస్తారు. అలాగే వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా సదుపాయం, మద్దతు ధరలతో పంటలను అమ్ముకునే అవకాశం కల్పిస్తారు. అతివృష్టి, అనావృష్టితో నష్టపోతే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ కూడా లభిస్తుంది.

2023–24లో భారీ ఎత్తున సీసీఆర్‌సీ కార్డులు జారీ కావడంతో వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం లభించింది. సాగుదారులకు సెప్టెంబరు నెల మొదట్లోనే పెట్టుబడి సాయం అందించింది. గత ఏడాది 3,044 మంది సాగుదారులకు రూ.4.10 కోట్లు పెట్టుబడిసాయం అందింది. 2023–24లో 6,965 మంది సాగుదారులకు రూ.5.22 కోట్లు అందించింది. 2023–24లో మూడో విడత కింద ఈ నెలలో పట్టాదారులకు వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ఇందులో మరికొంత మంది సాగుదారులకు పెట్టుబడిసాయం అందే అవకాశం ఉంది.

ఈ ఏడాది ఎక్కువ మందికి ప్రయోజనం



ఈ ఏడాది ఎక్కువ మంది సాగుదారులకు ప్రయోజనం కల్పించాలనే లక్ష్యంతో ఉన్నాము. ఇందులో భాగంగా 2023–24 సంవత్సరానికి 18,020 సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశాము. ఇప్పటికే 10వేల మందికిపైగా సాగుదారుల వివరాలను వైఎస్‌ఆర్ రైతుభరోసా పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాము. సాగుదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు పంపిణీ చేసేందుకు చర్యలు సైతం చేపట్టాం.

–పీఎల్ వరలక్ష్మి, డీఏఓ, కర్నూలు

సాగుదారులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు



2023–24లో సీసీఆర్‌సీ కార్డులు పొందిన సాగుదారులకు పెద్ద ఎత్తున రుణాలు పంపిణీ చేయనున్నాం. సాగుదారులకు వ్యక్తిగతంగా రుణాలు ఇవ్వడంపై బ్యాంకర్లకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ యంత్రాంగం సీసీఆర్‌సీ కార్డులు పొందిన వారితో జేఎల్‌జీ గ్రూపులు ఏర్పాటు చేసి బ్యాంకర్లకు అందజేస్తే రుణాలు ఇప్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాము.

– రామచంద్రరావు, ఎల్‌డీఎం, కర్నూలు

రూ.1,65,000 రుణం పొందాం



మాకు ఎటువంటి పొలం లేదు. 2022–23లో 3.30 భూమి కౌలుకు తీసుకుని ఉల్లి సాగు చేశాం. ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డు జారీ చేసింది.ఈ కార్డుపై బ్యాంకు నుంచి రూ.1.65 లక్షల రుణం పొందాము. ప్రభుత్వం వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయం కూడా అందజేసింది. మాలాంటి కౌలుదారులకువె ప్రభుత్వం అందిస్తున్న ఈసాయం ఎంతగానో ఊరట ఇస్తోంది.

– కె.ప్రశాంతి, బి.తాండ్రపాడు, కర్నూలు మండలం

మధ్యంతర బెయిల్‌పై సంబరాలా!

- నాలుగు వారాల అనంతరం 'బాబు' తిరిగి జైలుకే
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): మధ్యంతర బెయిల్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జైలు నుంచి బయటకు వస్తే ఆపార్టీ నేతలు నిజం గెలిచిందంటూ సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక జెడ్పీలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో జైల్లో ఉన్న చంద్రబాబును ఎలాగైనా బయటకు తీసుకురావాలని ఆయన తరఫు న్యాయవాదులు అనారోగ్య సమస్యలను చూపించారన్నారు. కంటి ఆపరేషన్ పూర్తి అయిన అనంతరం నాలుగు వారాల తరువాత తిరిగి చంద్రబాబు జైలుకు వెళ్లక తప్పదన్నారు. ఆయనపై నమోదు చేసిన కేసుల్లో తాను సచ్చీలుడని కోర్టులో నిరూపించుకొని బయటకు వస్తే నిజం గెలిచినట్లని, కేవలం మధ్యంతర బెయిల్ రావడంతో కేసు గెలిచినట్లు కాదన్నారు. సాధారణ ఖైదీలకు కూడా వారి కుటుంబ సభ్యులు మృతి చెందిన సమయంలోనో, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తిన సందర్భాల్లోను న్యాయస్థానాలు ఇంటీరియం బెయిల్ మంజూరు చేస్తాయన్నారు. చంద్రబాబు విషయంలో కూడా అదే జరిగిందన్నారు. చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై బయటకు రావడంతో టీడీపీ నేతలు హోమాలు, పూజలు చేయడం, ఆయన చిత్ర పటాలకు పాలాభిషేకాలు చేయడం వారి వింతపోకడలకు నిదర్శనమన్నారు. బెయిల్ వస్తుందని ముందే తెలుసుకొని జనాన్ని రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద పోగు చేశారన్నారు. చంద్రబాబు పట్ల ప్రజల్లో ఎలాంటి సానుభూతి లేదన్నారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజల సొమ్ముతో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, టీడీపీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో పాటు ఇంకా పలు కేసులు చంద్రబాబుపై ఉన్నాయన్నారు.

మహానందిలో 14 నుంచి కార్తీకమాసోత్సవాలు

మహానంది: మహానంది ఆలయంలో ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీకమాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వేదపండితులు చెండూరి రవిశంకర అవధాని, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావులతో కలిసి బుధవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడారు. నవంబర్ 20, 27, 28, డిసెంబర్ 4, 5వ తేదీల్లో ఐదు సోమవారాలు వచ్చాయన్నారు. సోమవారాలతో పాటు కార్తీకపౌర్ణమి, సెలవురోజుల్లో అభిషేకాలు, కేదారేశ్వరవ్రతాలు చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన కార్తీకపౌర్ణమి సందర్భంగా కోటిదీపోత్సవం, జ్వాలా తోరణం కార్యక్రమాలు ఉంటాయన్నారు. డిసెంబర్ 11న మహానందీశ్వరస్వామి వారికి లక్ష బిల్వార్చన, అమావాస్య పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు పాల్గొన్నారు.

త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సృజన

- రాష్ట్ర అవతరణ దినోత్సవంలో కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): తెలుగుజాతి ఔన్నత్యాన్ని కాపాడిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. అమరజీవి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అమరజీవి ప్రాణత్యాగంతో 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందని, తరువాత తెలంగాణతో కలపి 1956 నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమైనదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో మల్లికార్జునుడు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ

- కర్నూలు జిల్లాలో 1,00,800.. నంద్యాల జిల్లాలో 1,15,410 పింఛన్ల పంపిణీ



గోనెగండ్లలో సంజమ్మకు వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భారతి

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ఉమ్మడి జిల్లాలో బుధవారం ఉదయం నుంచే మొదలైంది. గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం విశేషం. సాయంత్రం 5 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,46,122 ఫించన్‌లు ఉండగా.. మొదటి రోజున 1,00,800 మందికి(40.96 శాతం) పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,22,277 పింఛన్లు ఉండగా 1,15,410 మందికి(51.92 శాతం) పింఛను సొమ్ము అందించారు. గ్రామ, వార్డు వలంటీర్లు ఉదయమే వచ్చి పింఛన్లు అందించడంతో అవ్వాతాతల ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది. డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ షరీఫ్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

కరువు రైతుకు అండగా..

- కరువు మండలాలను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- పంట నష్టంపై ఎన్యూమరేషన్‌కు త్వరలో మార్గదర్శకాలు

కర్నూలు(అగ్రికల్చర్): కరువు రైతుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 30 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తిస్తూ గజెట్ విడుదల చేసింది. రెండు మండలాలు మినహా కర్నూలు జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతాలుగా గుర్తించడంతో రైతులు ఊరట చెందుతున్నారు. కరువు ప్రాంతాలుగా గుర్తించడంతో రైతులకు వివిధ ప్రయోజనాలు చేకూరే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ పంటల పరిస్థితిని రెండు జిల్లాల అధికార యంత్రాంగం ఇటీవలనే ప్రభుత్వానికి నివేదించింది. పంటల సాగు విస్తీర్ణం, తేమ శాతం, భూగర్భ జలాల పరిస్థితి, వర్షపాతం వివరాలు, మండలాల వారీగా పంటల దిగుబడులు ఏ స్థాయిలో వస్తాయో నివేదికలో పొందుపరిచారు. వీటి ఆధారంగా కరువు ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. కర్నూలు జిల్లాలో 26 మండలాలు ఉండగా.. తుగ్గలి, కర్నూలు రూరల్ మినహా మిగిలిన అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. ఇందులో ఆదోని, కృష్ణగిరి మండలాల్లో కరువు మధ్యస్థంగా ఉన్నట్లుగా స్పష్టమైంది. మిగిలిన 24 మండలాల్లో కరువు తీవ్రత ఎక్కువగానే ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నంద్యాల జిల్లాలో బనగానపల్లె, మిడుతూరు, పగిడ్యాల, గడివేముల, బేతంచెర్ల, పాణ్యం మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఇందులో పాణ్యం మండలంలో కరువు మధ్యస్థంగా ఉండగా... మిగిలిన మండలాల్లో తీవ్రంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. కర్నూలు జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం ఆశాజనకంగానే ఉన్నప్పటికీ మిగిలిన అన్ని పారామీటర్లు(వర్షపాతం, దిగుబడులు, భూగర్భ జలాలు) నిరాశజనకంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

ఖరీఫ్‌లో 10 లక్షల ఎకరాల్లో పంటల సాగు

ఖరీఫ్ సాధారణ సాగు 10.42 లక్షల ఎకరాలు ఉండగా ఈ–క్రాప్ ప్రకారం 4,78,743 మంది రైతులు 10 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు సాధారణ వర్షపాతం 401.1 మి.మీ. ఉండగా.. 329.5 మి.మీ. నమోదైంది. ఖరీఫ్ మొత్తంగా 18 శాతం లోటు వర్షపాతం ఉంది. జూన్ నెలలో 40 శాతం లోటు, జూలైలో 64 శాతం ఎక్సెస్, ఆగస్టులో 75 శాతం లోటు, సెప్టెంబరు నెలలో 10 శాతం లోటు వర్షపాతం ఉంది. జూలై నెల మినహా మిగిలిన మూడు నెలల్లో వర్షాలు నిరాశజనకంగా ఉన్నాయి. కర్నూలు జిల్లాతో పోలిస్తే నంద్యాల జిల్లాలో వర్షాలు మెరుగ్గా ఉన్నాయి. ఖరీఫ్‌లో ఈ జిల్లాలో ఎక్సెస్ వర్షపాతం నమోదైంది. కరువు మండలాల్లో పంట నష్టంపై ఎన్యూమరేషన్ చేపట్టడానికి మార్గదర్శకాలు త్వరలో విడుదల కానున్నాయి.

విచారణ.. కాలయాపన

- విద్యాశాఖలో వింత పరిస్థితి
- ఫిర్యాదులపై స్పందించని అధికారులు



కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు, ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించేందుకు ప్రభుత్వం మండలానికి ఇద్దరేసి విద్యాధికారులను నియమించింది. అయితే ఫిర్యాదులపై విచారణ జరపకుండా విద్యాశాఖ అధికారులు కాలయాపన చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కర్నూలు మండల పరిధిలోని మిలటరీ కాలనీ జెడ్పీ హైస్కూల్‌లో ఓ టీచర్.. విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని కొందరు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన ఆగస్టు నెలలో జరిగినా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో విచారణ చేయలేదు. డిప్యూటీ డీఈఓ తూతూ మంత్రంగా విచారణ చేసి వదిలేశారు. ఇంత వరకు సదరు టీచర్‌పై చర్యలు తీసుకోలేదు. ఆరోపణలు వచ్చిన టీచర్‌ను కాపాడేందుకు అధికారులు మరొక స్కూల్‌కు బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈయన స్థానంలో కృష్ణగిరి మండలం కంబాలపాడు స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్‌ను డిప్యూటేషన్‌పై నియమించేందుకు ఓ సంఘం నాయకుడి ద్వారా లోపయికారీ ఒప్పందం చేసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అదే విధంగా కర్నూలు నగరంలోని కింగ్ మార్కెట్ దగ్గర ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బ్రిటీష్ కాలం నాటి కలప మాయమైంది. ఈ ఘటనపై కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ ఫిర్యాదు చేయగా.. తుతూ మంత్రంగా విచారణ చేసి వదిలేశారు. ఇదే స్కూల్‌లో మన బడి నాడు–నేడు పనులపై అక్కడి హెచ్‌ఎం చేసిన ఫిర్యాదుపై కూడా విద్యాశాఖ అధికారులు ఎలాంటి విచారణ చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమతున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం



మిలటరీ కాలనీ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులను వేధింపులకు గురి చేశారనే ఘటనపై డిప్యూటీ డీఈఓ విచారణ చేశారు. అక్కడి నుంచి మరొక చోటుకు బదిలీ చేయాలని రిపోర్ట్ ఇచ్చారు. చర్యలు తీసుకుంటున్నాం. కింగ్ మార్కెట్ స్కూల్ విషయంపై విచారణ జరిపి చర్యల కోసం ఆర్జేడీకి పంపించాం. అక్కడి నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది.

– డా.వి రంగారెడ్డి, డీఈఓ

న్యూస్‌రీల్

నూతన సీటీ స్కాన్ సేవలు ప్రారంభం



సీటీస్కాన్ మిషన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.2.30కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి నూతన సీటీస్కాన్ సేవలు బుధవారం ప్రారంభమయ్యాయి. విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగా ఆసుపత్రిలో పీపీపీ విధానంలో కొనసాగుతున్న ప్రైవేటు సీటీస్కాన్ సేవలను మంగళవారం నిలిపివేశారు. దీంతో డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో బుధవారం అత్యవసరంగా నూతన మిషన్‌కు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ట్రయల్ రన్ చేసి సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాధారాణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరనాథ్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

4న జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్

కర్నూలు సిటీ: నగరంలోని గుడ్‌షెప్పర్డ్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో ఈ నెల 4వ తేదీన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఈఓ డాక్టర్ వి. రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను ఈ కార్యక్రమంలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

కర్నూలు: కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత కల్పించినట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. గోడౌన్ వద్ద భద్రతా ఏర్పాట్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనుమతి లేకుండా గోడౌన్ పరిసర ప్రాంతాల్లోకి ఎవరినీ అనుమతించరాదని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్ ఉన్నారు.

దేవనకొండలో రేపు జగనన్నకు చెబుదాం–స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం దేవనకొండలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని దేవనకొండ మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచండి

కర్నూలు(సెంట్రల్): ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం ఉదయం ఆమె టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఆలూరు, గోనెగండ్ల, సి.బెళగల్, మద్దికెర, కోడుమూరు, పెద్దకడబూరు మండలాల్లో ఉపాధి పనులు తక్కువగా జరుగుతున్నాయన్నారు. కర్నూలు, ఆదోని, కోడుమూరు, గూడూరు అర్బన్, నందవరం మండలాల్లో గృహ నిర్మాణాల్లో పూరోగతి లేదని, గురువారం లోపు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. మూడో విడత రీసర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ పనులు 54 గ్రామాల్లో పూర్తి కావాల్సి ఉందన్నారు. నవంబర్ 15 నాటికి విలేజ్ సెక్రటరీ, వీఆర్వో లాగిన్లలో డేటా ఎంట్రీ పూర్తవ్వాలని సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. టెలికాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్, పత్తికొండ ఆర్‌డీఓ రామలక్ష్మి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

అమరజీవి త్యాగంతోనే ప్రత్యేక రాష్ట్రం

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, జెడ్పీ సిబ్బంది



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(అర్బన్): అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం ఫలితంగానే ప్రత్యేకంగా ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో జెడ్పీ ఉద్యోగులతో కలిసి ఆయన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణ త్యాగం చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించి పెట్టారన్నారు. జెడ్పీ సీఈఓ సీసీ అశ్వినీకుమార్, కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్, కార్యాలయ పర్యవేక్షకులు రాంగోపాల్, బసవశేఖర్, జితేంద్ర, సరస్వతమ్మ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డీపీఓలో..

కర్నూలు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎస్పీ కృష్ణకాంత్ పూ లమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు త్యాగఫలంతో తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా, ఎస్‌బీ సీఐ ప్రసాద్, ఆర్ఐలు రమణ, పోతలరాజు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతకు పెద్దపీట

- అంగన్‌వాడీ సేవలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు
- ఇప్పటికే కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ
- అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు యాప్‌ల్లో నమోదవుతోంది. కేంద్రం తెరిచినప్పటి నుంచి మూసే వరకు అక్కడ జరిగే ప్రతీదీ యాప్‌ల్లో కార్యకర్త నమోదు చేయాల్సి ఉంటుంది. పిల్లల హాజరు నుంచి మధ్యాహ్నం భోజనం వరకు అన్ని వివరాలు నమోదు చేయడం ద్వారా కేంద్రాల నిర్వహణలో పారదర్శకతను తెచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

– నంద్యాల(అర్బన్)



కార్యకర్తలకు అందించిన స్మార్ట్‌ఫోన్

జిల్లాలో 1,663 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 1,585 మంది కార్యకర్తలు పని చేస్తున్నారు. వీరికి స్మార్ట్ ఫోన్లు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 14,470 మంది గర్భిణులు, 12,535 మంది బాలింతలు ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 44,023 మంది, 0 నుంచి ఏళ్లలోపు 76,771 మంది చిన్నారులు ఉన్నారు. వీరందరి వివరాలు అంగన్‌వాడీ కార్యకర్తలు వారికి ఇచ్చిన ఫోన్లలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం తెరిచినప్పటి నుంచి ఉదయం 9 గంటలకు పిల్లలు హాజరు, గుడ్లు పెట్టినప్పుడు మధ్యాహ్న భోజనం చేసినప్పుడు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గర్భిణులు, బాలింతలకు టేక్‌హోమ్ రేషన్ ఇస్తున్నారు. టేక్ హోమ్ రేషన్ ఇస్తున్నప్పుడు కూడా గర్భిణులు, బాలింతలకు ఫొటో తీసి వాటి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ఫొటోలో ఉన్న వారి కంటే అదనంగా లబ్ధిదారులు కేంద్రానికి వచ్చారని చెప్పడానికి వీలు ఉండదు. దీని వల్ల గతంలో మాదిరి పిల్లలు రాకపోయినా వచ్చినట్టు హాజరు వేసుకోవడానికి వీలులేదు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పథకాలు పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందుతాయి.



చాపిరేవులలో చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

బలవర్ధకమైన ఆహారం..

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలకు ప్రభుత్వం బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తోంది. రోజుకోరకమైన ఆకుకూరలు, పప్పు, కూరగాయలు, గుడ్డుతో కూడిన ఆహారం అందిస్తోంది. ప్రతి రోజు చిన్నారులకు 100మి.లీ. గర్భిణులు, బాలింతలకు 200 మి.లీ పాలు చొప్పున ఇస్తున్నారు. గర్భిణులకు పప్పు చిక్కీలు, రాగి పిండి, బెల్లం, కర్జూరం పంపిణీ చేస్తున్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

యాప్‌లో వివరాలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలు వివరాలు యాప్‌లో ప్రతి కార్యకర్త నమోదు చేయాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం వారికి స్మార్ట్ ఫోన్లు అందించింది. రోజువారీగా జరిగే కార్యక్రమాలు ఫొటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. దీని వల్ల ఎటువంటి తప్పిదాలు జరగకుండా ఉంటాయి. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వం అందించే పథకాలు, పౌష్టికాహారం అందుతాయి.

– నిర్మల, ఐసీడీఎస్ పీడీ, నంద్యాల

అనుమానం పెనుభూతం

- భార్యను హత్య చేసిన భర్త



మృతి చెందిన ధనలక్ష్మి

కొలిమిగుండ్ల: అనుమానంతో కట్టుకున్న భార్య నే భర్త కడతేర్చిన ఘటన బుధవారం గొర్విమానుపల్లెలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గొల్ల నాగరాజుకు అనంతపురం జిల్లా తక్కళ్లపల్లెకు చెందిన ధనలక్ష్మి (25)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. ఇప్పటి వరకు సంతానం కలగలేదు. నాగరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. కొద్ది రోజుల నుంచి భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చి ధనలక్ష్మితో వాగ్వాదానికి దిగాడు. కోపోద్రిక్తుడై కర్రతో కొట్టి హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటి నుంచి పరారయ్యాడు. భార్యను హత్య చేసిన విషయాన్ని ఫోన్‌లో గ్రామస్తులకు చెప్పడంతో సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. కోవెలకుంట్ల సీఐ రామాంజులు, ఎస్ఐ రమేష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి హత్యకు కారణాలపై ఆరా తీశారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ చెప్పారు.

పోలింగ్ స్టేషన్లలో ముసాయిదా ఓటర్ల జాబితాలు

కర్నూలు(సిటీ) : ఇటీవలే విడుదల చేసిన 2024 ఓటరు ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చునని కర్నూలు ఆర్‌డీఓ హరి ప్రసాద్ కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌డీఓ మాట్లాడుతూ గ్రామాల్లోని ఓటరు జాబితాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో బీఎల్‌ఓల ద్వారా ఆయా రాజకీయ పార్టీలకు చెందినవారు ఫిర్యాదులు చేయవచ్చునన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్లలో ఓటరు జాబితాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 4,5 తేదీలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఆ రోజు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని ఓటర్లు తమ పేర్లు చెక్ చేసుకోవాలన్నారు. జాబితాలో పేరు లేకపోతే దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. సమావేశంలో తహసీల్దారు శివ రాముడు, డిప్యూటీ తహసీల్దార్ భాను, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.





తొలగిన 'దారి'ద్ర్యం

ఇది ఆదోని మండలం కె.నాగలాపురం గ్రామానికి వెళ్లే రహదారి. ఒక కిలోమీటరు దూరం ఉండే ఈ రహదారిని ఇరవై అయిదు సంవత్సరాలుగా పట్టించుకున్న వారు లేరు. గుంతల మయంగా మారడంతో గ్రామస్తులే గతంలో ఎర్రమట్టి తోలి చదును చేసుకుని ప్రయాణాలు కొనసాగించేవారు. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండటంతో గ్రామానికి చెందిన నాయకులు ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. జిల్లా కలెక్టరు, అధికారులతో మాట్లాడి రూ. 56 లక్షల నిధులను మంజూరు చేయించారు. దీంతో బీటీ రోడ్డు పనులను చేపట్టి త్వరగా పూర్తి చేశారు. ఇరవై అయిదు సంవత్సరాల తర్వాత గ్రామానికి పూర్తి స్థాయిలో రోడ్డు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– ఆదోని సెంట్రల్

ఘరానా మోసగాడి అరెస్టు

- ఆరోగ్యశ్రీ ఉద్యోగినంటూ బాధితుల ఖాతాల్లో నగదు దోచుకున్న వైనం
- నిందితుడితో పాటు సహకరించిన మరో ఇద్దరు అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ వెంకట్రామయ్య

ఆళ్లగడ్డ: ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో ఉద్యోగినంటూ అమాయకుల ఖాతాల్లో డబ్బులు ఖాళీ చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ఘరానా మోసగాడి ఆట ను ఆళ్లగడ్డ పోలీసులు కట్టించారు. మోసగాడితోపాటు అతనికి సహకరిస్తూ వస్తున్న మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రి పట్టణానికి చెందిన మహబూబ్‌బీకి ఇటీవల ఒక ఫోన్ వచ్చింది. '' నేను ఆరోగ్య శ్రీ ఉద్యోగిని. మీ భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు కదా. దీనికి గాను ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 35 వేలు మంజూరైంది. నీ ఫోన్‌పే నంబర్ చెప్పు' అని అడిగాడు. దీంతో ఆ మహిళ తనకు ఫోన్‌పేలేదని తన తమ్ముడు బాచేపల్లి గ్రామానికి చెందిన బాబాఫకృద్దీన్‌తో మాట్లాడాలని సూచించింది. అనంతరం ఫకృద్దీకి ఫోన్ చేసి.. మీకు రూ. 35 వేలు ఆరోగ్యశ్రీ డబ్బు జమ కావాలంటే మీ బ్యాంక్ ఖాతాలో ఏమీ ఉండకూడదని, ప్రస్తుతం ఎంత ఉందో చెప్పాలని అడగడటంతో తన ఖాతాలో రూ. 19 వేల దాక ఉందని ఫకృద్దీన్ చెప్పాడు. అయితే తాను ఒక లింక్ (యూపిఐ ఐడి ఎశ్రీరామ్0531 వైబిఐ) పంపిస్తాను దానికి నీ ఫోన్‌పేలో ఉన్న డబ్బులు మొత్తం పంపితే వెంటనే మీడబ్బుతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా మంజూరైన రూ.35 వేలు మీ ఖాతాకు జమ అవుతాయని చెప్పి లింక్ పంపించాడు. వెంటనే ఫోన్‌పేలో డబ్బు పంపిన ఫకృద్దీన్ తిరిగి ఆ నంబర్‌కు కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయానని తెలుసుకుని సీఐ హనుమంత్‌నాయక్, ఎస్ఐ నరసింహులును ఆశ్రయించగా సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి విచారించారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు పట్టణానికి చెందిన వీరనారిబాలాజీ మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. తమదైన శైలిలో విచారించగా ఇందులో ఇతని ఫోన్‌పేకు వచ్చిన డబ్బు వెంటనే తన స్నేహితుడు ఆవుల శ్రీరామ్‌కు పంపించగా.. అతను డ్రా చేసుకుని తీసుకు వచ్చినందుకు రూ. 10 వేలకు రూ.వెయ్యి కమీషన్ తీసుకున్నాడు. అలాగే యాప్ ద్వారా గోల్డ్ కాయన్‌లు బుక్ చేసుకుని బాధితుల నుంచి నగదు జమ చేయించి వీరనారిబాలాజీ మరో స్నేహితుడు మహబూబ్‌బాషా మోసం చేస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 3 లక్షల నగదు, రెండు గోల్డ్ కాయన్స్లు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్ఐతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఎమ్మెల్యే చొరవతో 80 అడుగుల రోడ్డు

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



రోడ్డు నిర్మాణానికి కొలతలు వేయిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



జేసీబీలతో రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చొరవతో పట్టణంలోని మిలటరీ కాలనీ నుంచి కోసిగి రోడ్డుకు అనుసంధానంగా 80 అడుగుల వెడల్పుతో 1.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. పట్టణంలోని మిలటరీ కాలనీకి ఇటీవల రూ. కోటి వ్యయంతో 50 అడుగుల బీటీ రోడ్డు నిర్మించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ రోడ్డు నుంచి కోసిగి ప్రధాన రహదారికి రూ.50 లక్షలతో 80 అడుగుల వెడల్పుతో గ్రావెల్ రోడ్డు, డ్రైన్ నిర్మించాల్సి ఉంది. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని బుధవారం ఐదు గంటల పాటు అక్కడే ఉండి.. సర్వే చేయించారు. సర్వే రాళ్లు పాతించి మొదటగా రోడ్డుకు ఇరువైపులా డ్రైన్ తీసే పనులను ప్రారంభింపజేశారు. విశాలమైన రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడంతో మిలటరీ కాలనీ వాసులతో పాటు వెంకటాపురం కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, తహసీల్దార్ ఆంజనేయులు, టీపీఓ గోపాలకృష్ణ, వెంకటాపురం కౌన్సిలర్ బజారి, వార్డు ఇన్‌చార్జ్ ప్రతాప్‌రెడ్డి, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వినియోగాన్ని పెంచాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో చేపల వినియోగాన్ని గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి అన్నారు. రాయలసీమ స్థాయిలో కర్నూలులో ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తుండటం శుభపరిణామమని చెప్పారు. బుధవారం మత్స్యశాఖ అధికారులు ఆయనతో పోస్టర్లు విడుదల చేయించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల మాట్లాడుతూ.. ఈ నెల 3,4,5 తేదీల్లో ప్రాన్స్, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. తాము కూడా ఈ కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేసేందుకు ప్రయత్నిస్తామని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లు సీజ్

కర్నూలు (న్యూసిటీ): పాణ్యం మండలం సుగాలి మెట్ట దగ్గర అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నారనే సమాచారంతో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మైనింగ్, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ దాడుల్లో ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. ఆ వాహనాల్లో ఎంతమేర మట్టి తరలించారని పంచనామా నిర్వహించి యజమానులకు నోటీసులు పంపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా మట్టి అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో నంద్యాల ఏడీ రామచంద్ర, విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతిరావు, సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నందిపాడులో ఓ వివాహిత బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఉప్పర ప్రసాద్‌కు వైఎస్సార్ కడప జిల్లా దేవగుడికి చెందిన పుష్ప(23)తో మూడేళ్ల క్రితం పెళ్లి అయింది. భర్త ప్రసాద్ వ్యవసాయంతో పాటు గ్రామ వలంటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రసాద్ ఇతరులకు చెందిన పొలంలో మోటార్ అమర్చుతుండటంతో అక్కడికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్ది సేపటి తర్వాత ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలికి కొద్ది రోజుల నుంచి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటోంది. అనారోగ్యమా? లేక కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడిందా అనే వాటిపై విచారణ చేస్తామని ఎస్ఐ చెప్పారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ మైదానంలో విద్యార్థులకు బాల్య వివాహాలు, మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే సమాజానికి చాలా నష్టం కలుగుతుందన్నారు. విద్యార్థులు సమజానికి ఉపయోగకరమైన ఆలోచనలు చేయాలని, ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఎంఈఓ శివరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పతకాలు

కర్నూలు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు, అగ్నిమాపక శాఖలలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ఉత్తమ, సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసు శాఖలోని వివిధ విభాగాలతో పాటు అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న ముగ్గురికి ఉత్తమ సేవా పతకాలు, 18 మందికి సేవా పతకాలు లభించాయి. కర్నూలు యూనిట్‌లో ఏఆర్ పీసీగా పనిచేస్తున్న బండ శ్రీనివాసులు, ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.మహబూబ్ బాషా, హోంగార్డ్ డీఎస్పీ కృష్ణమోహన్‌లకు ఉత్తమ సేవా పతకాలు దక్కాయి.

సేవా పతకాలు

పేరు	హోదా	విభాగం
ఎం.రాధాకృష్ణయ్య	ఆర్ఎస్ఐ	రెండవ బెటాలియన్
షేక్ ఖాదర్ బాషా	సీఐ	కర్నూలు సీఐడీ
ఆవులరెడ్డి రాధాకృష్ణ	ఆర్ పీఎస్ఐ	డీటీసీ, కర్నూలు
బోయ రంగముని	ఏఆర్ డీఎస్పీ	డీఏఆర్, నంద్యాల
దాదా సుజాహ కుమారి	డబ్ల్యూ ఏఎస్ఐ	కర్నూలు టూటౌన్
భైకారి శ్రీనివాసులు	ఏఆర్ఎస్ఐ	డీఏఆర్, కర్నూలు
యంపలాకుల శ్రీనివాసులు	హెచ్‌సీ	కర్నూలు ఫోర్త్‌టౌన్
తోట నాగభూషణ్ రావు	పీసీ	వెల్దుర్తి
ఈడిగ వెంకటేశ్వర్లు	ఏఆర్ ఎస్ఐ	డీఏఆర్, నంద్యాల
ఈడిగ బాలచంద్రుడు	ఏఎస్ఐ	మహానంది
మీర్జా ఖలీముల్లా బేగ్	ఏఎస్ఐ	బేతంచెర్ల
అయ్యన్న	ఏఆర్ ఎస్ఐ	సెకండ్ బెటాలియన్
సి.గోపాల్‌రెడ్డి	ఏఆర్ ఎస్ఐ	సెకండ్ బెటాలియన్
జి.గోవిందరాజులు	ఏఆర్‌హెచ్‌సీ	హోంగార్డ్స్‌యూనిట్, కర్నూలు
పి.సత్యరాజు	లీడింగ్ ఫైర్‌మెన్	కర్నూలు ఫైర్ స్టేషన్
జి.వెంకటేశ్వర్లు	డ్రైవర్ ఆపరేటర్	నంద్యాల ఫైర్ స్టేషన్
షేక్ జిలానీ	పీసీ,	విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీస్, కర్నూలు)
ఈశ్వర్‌నాయక్	లీడింగ్ ఫైర్‌మెన్	బనగానపల్లె